ప్రజాశక్తి
బుధవారం 8 ఫిబ్రవరి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

వార్త మెయిన్‌లో

భూములను ట్రాక్టర్‌తో దున్నిస్తున్న దళితులు

మా భూములు మాకే సొంతం

- గ్రానైట్ పేరుతో ప్రభుత్వం తీసుకున్న భూములను దున్నిన దళితులు
- పోరాటానికి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు

ప్రజా వ్యతిరేక బడ్జెట్

- రాష్ట్రానికి తీరని అన్యాయం
- బడ్జెట్‌పై ఆందోళనలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల పిలుపు
- సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

రౌండ్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, హాజరైన నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు మరింత దోచిపెట్టే విధంగా, ప్రజలపై భారాలు మోపే విధంగా ఉందని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, కడప ఉక్కు కర్మాగారానికి నిధులు ఏవీ బడ్జెట్‌లో కేటాయింపులు లేవని అన్నారు. కరోనా నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పెంచే చర్యలు లేకపోగా, గ్రామీణ ఉపాధికి గత బడ్జెట్ కంటే రూ.30వేల కోట్లు తగ్గించారన్నారు. ధాన్యం సేకరణకు నిదులు తగ్గించారని, ఎరువులపై సబ్సిడీలు కుదించారని, ఈ బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేని, యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదని, మైనార్టీలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని విమర్శించారు. సమావేశంలో వీధి వ్యాపారుల సంఘం నాయకులు టి.సాంబయ్య, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణకాంత్, ఎ.ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు కె.కోటయ్య తదితరులు ప్రసంగించారు.

నాయకుల అభిప్రాయాలు 2లో

స్వాధీనం చేసుకున్న బియ్యం వద్ద విజిలెన్స్ అధికారులు

గుంటూరు టు గుజరాత్

- 921 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- మిల్లు యజమాని, లారీ ఓనర్‌పై కేసులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇది తెలిసిన విజిలెన్స్ అధికారులు ఫిరంగిపురం మండలం రేపూడిలోని విజయలక్ష్మి రైస్ ట్రేడర్స్‌కు కొంత దూరంలో మంగళవారం నిఘా వేసి, మిల్లులో నుండి బియ్యంతో వెళ్తున్న లారీని పట్టుకున్నారు. 600 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ చుక్కా మాణిక్యరావును విచారించగా విజయలక్ష్మి రైస్ ట్రేడర్స్ యజమాని పసుమర్తి వెంకట 2లో

2లో

పట్టాలు అందిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జెసి

అభివృద్ధి వైపు పల్నాడు అడుగులు

భూమి పట్టాల పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యే

రేపు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద బ్లాక్ డే నిరసన 5లో

రైతుల సలహాలను తీసుకుంటాం

- రైతు భరోసా కేంద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది
- నంబూరులోని ఆర్‌బికెలకు సందర్శన
- పశులు కొనుగోలుకు రుణాలివ్వాలని కోరిన రైతులు

ప్రజాశక్తి-గుంటూరు

మహిళా రైతులతో మాట్లాడుతున్న గోపాలకృష్ణ ద్వివేది, తదితరులు

రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలనే సిఎం అలోచనలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి, రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రైతు భరోసా కేంద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. పెదకాకాని మండలం నంబూరులోని ఆర్‌బికె కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ వ్యవసాయ వనరుల కేంద్రంలోని కియోస్కీ ద్వారా రైతులు స్వయంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అర్డర్లు, సాగుకు సంబంధించి ఇతర అంశాలపై సమాచరం తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వ్యవసాయ యంత్ర సేవా పథకం ద్వారా యంత్రాలు పొందిన వారు ఆర్బీకే పరిధిలోని ఇతర రైతులకు యంత్రాలు అద్దెకు ఇచ్చేలా, రైతులే నేరుగా యంత్రాల కోసం దరఖాస్తు చేసుకునేలా, అవగాహన లేని వారికి వ్యవసాయ సహాయకులు దరఖాస్తు చేసేలా నూతనంగా అమల్లోకి తెచ్చే యాప్‌లో అవకాశం కల్పించాలని చెప్పారు. గ్రామంలో పశు సంపదను పెంచుకునేందుకు గేదేల కొనుగోలుకు రుణాలు అందించటంతో పాటు, స్థానికంగా మేలురకం పశుగ్రాసం ఉత్పత్తికి పశుసంవర్ధక ద్వారా సహాయం అందించాలని 2లో

సమీక్షలో మాట్లాడుతున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

పన్ను వసూళ్లులో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

అడ్మిన్ సెక్రెటరీ సస్పెన్షన్ వేటు, పలువురికి షోకాజులు

రోజూ రూ.కోటి వసూలు చేయాలని ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 ముగింపునకు 7 వారాలే గడువుందని, నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని అధికారులు, సిబ్బందిని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ప్రతిరోజు రూ.కోటి వసూళ్ళు లక్ష్యంగా పని చేయాలన్నారు. రెవెన్యూ వసూళ్లు, రీసర్వే, రోడ్డు విస్తరణ పనులు, మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజుల వసూళ్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం నిర్వహించారు. కమిషనర్ తొలుత రెవెన్యూ విభాగంపై సమీక్షించి, పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మార్చి చివరి నాటికి బకాయి ఉన్న రూ.70 కోట్లు వసూలు చేయాలన్నారు. చౌడవరంలో కొన్ని అసెస్మెంట్‌లకు దీర్ఘకాలంగా వినియోగం మేరకు పన్ను విధించకపోవడం వలన జిఎంసికి భారీ మొత్తంలో ఆర్థిక నష్టం కలిగిందని సంబందిత అడ్మిన్, ఆర్‌ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌడవరం 187 వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శి తులసి రాంను సస్పెండ్ చేస్తూ ఆర్ఐ షేక్ సలాంకు చార్జి మేమో ఇవ్వాలని అదనపు కమిషనర్‌ని 2లో

అభివృద్ధి వైపు పల్నాడు అడుగులు

81 మందికి భూమి పట్టాల పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గురజాల

అత్యధిక వెనుకబాటుకు గురైన పల్నాడు జిల్లా ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులేస్తోందని కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. వ్యవసాయ ఆధారిత కుటుంబాలుగా గుర్తించిన 81 మందికి భూమి పట్టాలను స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించడానికి, వ్యవసాయానికి తగిన భూమి అందించి వారి జీవన విధానంలో మార్పు తేవడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థ, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పల్నాడు ప్రాంత ప్రజలపై నక్సలిజం ప్రభావం చూపిందన్నారు. నిరుద్యోగ యువత తమ ప్రాంతవాసులకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, పాలక ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసిన విధానంతో అప్పట్లో పెద్ద ఎత్తున అలజడులు, దాడులు, ప్రతిదాడులు జరిగాయని చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంత ప్రజల జీవన విధానం ప్రశ్నార్థకమైందని, ఇకపై సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్, ఆర్‌డిఒ అద్దెయ్య, తహశీల్దార్ డానియల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంటూరు టు గుజరాత్

(మొదటి పేజీ తరువాయి)

శివనాగ ప్రసాద్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం బియ్యాన్ని గుజరాత్ రాష్ట్రానికి తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అధికారులు మిల్లులో తనిఖీలు చేసి 792 బస్తాల బియ్యాన్ని, రాశిగా పోసి ఉన్న 450 బస్తాల బియ్యాన్ని గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ముద్రలు కలిగిన 12 సంచులనూ అధికారులు గుర్తించారు. రేషన్ బియ్యాన్ని విజయలక్ష్మి రైస్ ట్రేడర్స్ యజమాని పసుమర్తి వెంకట శివనాగ ప్రసాద్ అక్రమంగా కొనుగోలుచేసి సంచులు మార్చి తప్పుడు రికార్డులతో అక్రమ వ్యాపారం చేయుచున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. మిల్లులోని 1242 బస్తాలు, లారీలోని 600 బస్తాలు మొత్తం 921 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ట్రేడర్స్ యజమాని, లారీ ఓనర్ కమ్ డ్రైవర్ మాణిక్యరావుపై 6ఎ, క్రిమినల్ కేసులు నమోదుకు స్థానిక అసిస్టెంట్ సప్లయీస్ అధికారిని ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, తహసిల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ఆర్థిక నష్టానికి భాధ్యులైన వారిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షించారు. రీ సర్వే ఆశించిన స్థాయిలో జరగడం లేదని, అడ్మిన్ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని, వచ్చే వారానికి ప్రతి సచివాలయం పరిధిలో రీ సర్వే 75 శాతం మించాలని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల వారీగా సమీక్షించి, టిడిఆర్ బాండ్లు జారీ చేయాల్సిన వారికి డాక్యుమెంట్స్ ప్రక్రియ పూర్తీ చేయాలని, నష్ట పరిహారం చెల్లించిన గృహాల స్వచ్ఛంద తొలగింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. చిన్నేరుకుంట, రెడ్డిపాలెం, టెలికాంనగర్, గడ్డిపాడుల్లో రోడ్ విస్తరణకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు. ఏటి అగ్రహారం రోడ్ విస్తరణ పనుల్లో గైర్హాజరైన ఐదుగురు ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

రైతుల సలహాలను తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

పలువురు రైతులు కోరారు. ధాన్యం డ్రయ్యర్లు ఏర్పార్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతంరం నంబూరులోని వెటర్నీ డిస్పెన్సరీలో జగనన్న పాలవెల్లువకు సంబంధించి ఏర్పాటు చేసిన అటో మిల్క్ కలెక్షన్ సెంటరును అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి సుజాత, జిల్లా సహకార శాఖాధికారి వీరాచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి వెంకటేశ్వర్లు, తహశీల్దార్ రత్నం, ఎంపిడిఒ మల్లేశ్వరరావు, మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

బడ్జెట్‌పై ఆందోళనలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల పిలుపు

సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

మైనార్టీలపై వివక్ష

ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ

మైనార్టీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షను ప్రదర్శిస్తున్నాయి. మైనార్టీలు విద్యలో బాగా వెనుకబడి ఉన్నారని పలు సర్వేలు చెబుతున్నాయి. అయితే కేంద్రం మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోకపోగా, ఇప్పుడిస్తున్న స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్‌లు కూడా రద్దు చేసింది. మైనార్టీలను పూర్తిగా విద్యకు దూరం చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ఇప్పటిదాకా మైనార్టీలపై సామాజిక దాడి చేశారు. ఇప్పుడు ఆర్థిక దాడి కూడా మొదలైంది.

మోడి చెప్పేదొకటి, చేసేది ఒకటి

రైతు రక్షణ వేదిక నాయకులు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు

మోడి అధికారంలోకి వచ్చాక 2022లోగా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్నాడు. కానీ అమలు జరగలేదు. మరింత దిగజారిపోయింది. ఎరువులపై సబ్సిడీలను భారీగా కుదించారు. మోడి మాటలు ఒక విధంగా చేతలు ఒక విధంగా ఉన్నాయి. బడ్జెట్‌లో సైన్స్, సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం లేదు.

ప్రత్యామ్నాయ బడ్జెట్ కోసం మహా ఉద్యమం

డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్

రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లు అప్పులకు వడ్డీలు కట్టటానికే సరిపోతుంది. స్కాలర్‌షిప్పులు 20 లక్షల మందికి తగ్గించారు. ప్లానింగ్ కమిషన్ లేకపోవటం వల్ల బడ్జెట్ స్వరూపమే మారిపోయింది. సంక్షేమ బడ్జెట్‌లు వ్యాపార బడ్జెట్‌లుగా మారిపోయి. ప్లానింగ్ కమిషన్ ఉంటే దేశ పరిస్థితులను అంచనా వేసి, నిధుల కేటాయింపునకు సిఫార్సు చేస్తుంది. ప్రత్యామ్నాయ బడ్జెట్ కోసం గ్రామీణ ప్రాంతం నుంచి మహా ఉద్యమం రావాలి.

గ్రామీణ ప్రజలపై తీవ్ర ప్రభావం

సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాలపైనా, వివిధ రంగాలపైనా గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీకి, ఆహార సబ్సిడీకి నిధులు కుదించటం గ్రామీణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపించనుంది. ప్రజలపై మరిన్ని భారాలు పడనున్నాయి.

సంక్షేమ రంగాలకు కోత

ఎం.హరిప్రసాద్, సిపిఐ (ఎంఎల్)రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు

సంక్షేమ రంగాలకు నిధులు కుదించారు. రక్షణ రంగానికి నిధులు పెంచారు. రక్షణ రంగానికి రూ.69 వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలకు రూ.10 లక్షల కోట్లు కేటాయించటం ద్వారా కార్పొరేట్లకు ఏ విధంగా ఊడిగం చేయనున్నదో అర్థమవుతోంది. దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న 23 కోట్ల మంది ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవట్లేదు.

రైల్వే ఉద్యోగులపై పనిభారం

ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు ఎ.హరి

దేశంలో ఎంతో కీలకమైన రైల్వే రంగంలో కొత్త ఉద్యోగాలు లేకపోవటం వల్ల ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోంది. ట్రాక్‌లు పెరిగాయి, రైళ్ల సంఖ్య పెరిగినా ఉద్యోగుల సంఖ్య పెరగలేదు. 18 లక్షల మంది ఉండే రైల్వేలో ప్రస్తుతం 14 లక్షల మందే పని చేస్తున్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించారు

పాలరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్

దేశంలో ఇప్పటికీ 60 శాతంపైగా ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయన్ని రెట్టింపు చేయకపోగా, మరింత తగ్గించే విధంగా, భారాలు మోపే విధంగా ఉంది. దేశానికి ఆహారం అందిస్తున్న వ్యవసాయ రంగానికి గతేడాది కంటే నిధులు కుదించటం అత్యంత దుర్మార్గం. రైతుల ఆత్మహత్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నివారణకు ఎలాంటి చర్యలూ లేవు. పాలపై పన్నులు విధించిన ప్రభుత్వంగా బిజెపి చరిత్రలో నిలిచిపోతుంది.

రాష్ట్రానికి మరోసారి అన్యాయం

బి.బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రానికి మరోసారి అన్యాయం జరిగింది. పోలవరం ప్రాజెక్టుకు, రాజధాని నిర్మాణానికి, వెనుబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు లేవు. ఇక ప్రత్యేక హోదా ఊసే లేదు. ఢిల్లీలో రైతులు పోరాడిన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంటలకు మద్దతు కల్పించలేదు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి, చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు.

ఎల్ఐసిని నిర్వీర్యం చేస్తున్నారు

టిడిపి అధికార ప్రతినిధి, డి.శ్రీనివాసరావు

కేంద్ర ప్రభుత్వానికి పరిపాలన చేతకపోతే అధికారం నుండి దిగిపోవాలి. అంతేకాగానీ ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ సరికాదు. ఎంతో పేరుగాంచి, మచ్చలేని ఎల్ఐసిని సైతం నిర్వీర్యం చేయటానికి కేంద్రం కుట్రలు చేయటం అన్యాయం. మోడీకి అంబానీ, అదానీ తప్ప సాధారణ ప్రజలు కనిపించట్లేదు. టిడిపి తరపున ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నాం. బడ్జెట్‌కు ముందు నిపుణలతో, రాజకీయ పక్షాలతో చర్చించి, అంచనాలు రూపొందిస్తే మంచి ఫలితాలు వస్తాయి. చిరువ్యాపారులపై పన్నుల భారం తగ్గించాల్సిన అవసరం ఉంది.

బిజెపి ఆర్భాటం చేస్తోంది



హనుమంతరావు, సిపిఐ జిల్లా నాయకులు

గొప్ప బడ్జెట్ అని బిజెపి ఆర్భాటం చేస్తోంది. సామాన్య ప్రజలకు కేటాయింపులు గమనిస్తే ప్రజావ్యతిరేక బడ్జెట్ అని అర్థం అవుతుంది. మోడీ అధికారంలోకి వచ్చాక సుమారు 6 లక్షల పరిశ్రమలు మూతపడ్డాయి. కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఒక్క కొత్త పరిశ్రమను కూడా మోడీ ప్రారంభించ లేదు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలకు తప్ప, ఇతర రాష్ట్రాలకు పెద్దగా కేటాయింపులు లేవు.

కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్

సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి యు.నాగేశ్వరరావు

కార్పొరేట్ల మద్దతు అధికారంలోకి వచ్చిన బిజెపి బడ్జెట్‌లో అదే వర్గాలకు దోచిపెట్టే విధానాలు అవలంబిస్తోంది. ఇది ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్. విద్య, వైద్య రంగాలను ప్రజలకు దూరం చేసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది.

మహిళలపై ప్రతికూల ప్రభావం

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ

వ్యవసాయ రంగానికి నిధులు, ఐసిఎస్‌డిఎస్‌కు, ఆహార రంగానికి నిధులు తగ్గించటం వల్ల మహిళలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఇప్పటికే మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యలను మరింత పెంచేలా మోడి విధానాలున్నాయి. గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఎత్తివేయటంతో మళ్లీ కట్టెల పొయ్యి వినియోగించాల్సి వస్తుంది.

నా గొంతు నొక్కేందుకు కుట్ర

నా కుటుంబానికి రక్షణ కల్పించాలి

రాష్ట ముఖ్యమంత్రికి అనిల్ కుమార్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

తనకు ప్రాణహాని ఉందని తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్ కుమార్ రాష్ట ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. తన గొంతు నొక్కిందుకే టీడీపీ దాడులకు పాల్పడుతుందని అనిల్ కుమార్ అన్నారు. సోమవారం అర్ధరాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వల్లూరి వారి తోటలోని రిపబ్లికన్ పార్టీ కార్యాలయన్ని పెట్రోల్ పోసి తగలు పెట్టడం జరిగిందని, ఇది కేవలం తనపై కుట్రపూరితంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అతని తమ్ముడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, గోళ్ళ అరుణ్ కుమార్ నా పార్టీ కార్యాలయాన్ని తగులబెట్టించారనీ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుచరగణంతో తన కార్యాలయం తగలబెట్టించారని ఆరోపించారు. కేవలం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు చేసిన కారణం గానే తమ కార్యాలయం తగల బెట్టడం జరిగిందని తెలిపారు. తాను ఇప్పటికి కోటంరెడ్డి శ్రీధర్ పై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాను అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేయడం వలన తాను ఈ విధంగా హెచ్చరించడం జరిగిందని ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాను ముందుకు వెళ్తాను తప్ప వెనక్కి తగ్గను అని అనిల్ కుమార్ అన్నారు. అంతేకాకుండా తమ ఆఫీస్ కార్యాలయంలో వంట మనిషి వాచ్ మెన్ పై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించడం జరిగిందని దీనిపై గుంటూరు జిల్లా ఎస్పీకి, అరెండల్ పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. తమ కార్యాలయం పై దాడులు చేయటం సమంజసం కాదని రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అనిల్ కుమార్ కోరారు. డొంక రోడ్డులోని తగలబెట్టిన క్యాంప్ కార్యాలయాన్ని బోరుగడ్డ అనిల్ పరిశీలించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బోరుగడ్డ అనిల్‌కుమార్

దాడి కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి- మంగళగిరి

2019లో మంగళగిరి పట్టణంలోని ఓ బారు వద్ద స్తంభాల ఈశ్వరరావుపై తాడేపల్లి కెఎల్‌రావు కాలనీకి చెందిన ఎస్‌కె రావుఫ్ బాష దాడి చేశాడు. బాధితుడి భార్య నాగలక్ష్మి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నారాయణ నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు విచారణలో బాషాపై నేరం రుజువు కావడంతో మంగళవారం మంగళగిరి సెక్షన్స్ కోర్టు జడ్జి డి.శేషయ్య నిందితునికి ఏడాది శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్ బాధితుని తరుపున వాదనలు వినిపించారు.

30 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పట్టణంలోని బావనగర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సోమవారం అర్ధరాత్రి ఒక ఇంటిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పొన్నూరు అర్బన్ పోలీసులు ఇంటి యజమాని పై కేసు నమోదు చేసి నిల్వ ఉంచిన 30 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌చార్జి ఎపిఒ గోపి సస్పెండ్

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

ఉపాధి హామీ పథకంలో రోజుకు 2 వేల పని దినాలు కల్పించలేక పోవటం, జూలై నుండి పని దినాలు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల పెదనందిపాడు ఇంచార్జ్ ఏపిఓ గోపిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు డ్వామా పిడి నుండి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి :	128,100
మిర్చి ఎగుమతి :	124,651
మిర్చి నిల్వ :	82,219

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7000 - 23000
నెం.5	8000 - 21000
273	7500 - 18000
341	7000 - 20000
4884	10000 - 16500
సూపర్-10	17500 - 19000
నాన్ ఎసి	
తేజ	7000 - 20000
బడిగి	7500 - 24500
దేవనూరు డీలక్స్	8000 - 20000
తాలుకాయలు	4000 - 12000

వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ అన్నపూర్ణ,సుప్రజ

1,108 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో మంగళగిరి ఎస్ఇబి అధికారులు దాడి చేసి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మంగళగిరి ఎస్ఈబి సిఐ మారయ్య బాబు,సిబ్బంది గోవా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేయగా ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని 1108 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారీ ఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఈబి సిఐ, సిబ్బందిని ఎస్ఇబి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, అదనపు ఎస్‌పి సుప్రజ, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టప్రకారం కాకుండా చట్టవిరుద్ధంగా ప్రవర్తించే వారిపై నిఘా ఎప్పుడూ ఉంటుందని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐ శేషగిరిరావు

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సిఐ శేషగిరిరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉండవల్లికి చెందిన కాళ్ల వేమన, వసంతకుమార్‌లు కృష్ణాజిల్లా చిలకలపూడి రూరల్ మండలం , తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో అసాంఘీక కార్యకలాపలకు పాల్పడుతున్నారని తెలిపారు. మంగళవారం పొలకంపాడు, గుర్రాల చావిడి పక్కన నిషేధించిన గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఆప్రాంతానికి చేరుకొని వారి ఇరువురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఇద్దరు గతలో సీతానగరం తీర ప్రాంతాల్లో కూడా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడ్డారాని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు, డి. రమేష్, ఎస్ నారాయణ, పి.సిలు కొండలు , కల్యాణ్, శ్యామ్యూల్ రాజులను అభినందిచారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు

ఇద్దరు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి

నిమ్మతోటల్లో పేకాడుతున్న ఇద్దరు జూదరులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన రూరల్ గ్రామం సంగం జాగర్లమూడి లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం సంగంజాగర్లమూడి నిమ్మతోటల్లో పేకాట శిభిరంపై దాడి చేసి ఇరువురు జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.8,150 నగదును స్వాదీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్నవారితో పాటు పరారైన మరో ఇరువురు, పేకాట నిర్వాకుడిపైనా కేసు నమోదు చేశామని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. దాడిలో రూరల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక కొత్తపేటలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో చర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కెనాల్‌లో మహిళ మృతదేహం

ప్రజాశక్తి- ముప్పాళ్ల

గుర్తుతెలియన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కుందురువారిపాలెం గ్రామ సమీపంలో పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో చోటు చేసుకుంది. సుమారు 40 - 45 ఏళ్ల మధ్య వయసు గల మహిళ మృతదేహం నీళ్లలో తేలి అడుతూ ఉందని గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన రిపోర్టు ప్రకారం ఈ నెల 6వతేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కేసు విచారణలో భాగంగా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా ఆమెకు రెండు మోకాళ్లకు ఆపరేషన్ జరిగిందని,కాఫీ కలరు జాకెట్టు, బులుగు కలరు దుస్తులు ధరించి ఉందని తెలిపారు. పై ఆనవాళ్లు గల మహిళ సమాచారం తెలిసినవారు ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌కుగాని లేదా ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796233 గానీ, ఏఎస్ఐ ఇమామ్ సాహెబ్ ఫోన్ నెంబర్ 9949427947 గానీ సంప్రదించవలసినదిగా ఎస్ఐ తెలిపారు. అట్టి సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

వైఎస్సార్ బీమా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

భవన నిర్మాణ కార్మికులు వైఎస్సార్ భీమా కోసం విధిగా కార్మిక శాఖలో నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ ఎం.వినయకుమార్ మంగళవారం తెలిపారు. స్థానిక మారీసుపేటలోని కార్మిక శాఖ కార్యాలయంలో భీమా నమోదుకు సంబందించిన వివరాలు తెలుసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ జిరాక్స్, నామినీ ఆధార్ జిరాక్స్, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్, యూనియన్ బ్యాంకులో చెల్లించిన రూ.110 చలానతో కార్యాలయానికి రావాలని కోరారు. ప్రభుత్వం నుంచి అనేక విధాలుగా లబ్ధిపొందే అవకాశాన్ని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

10th Class సర్టిఫికెట్టు పోయినది.

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామ నివాసి, కొడాలి శ్రావణి తండ్రి వెంకటేశ్వరరావుకు చెందిన, మార్చి, 2013, రోల్ నెం. **1314135073**రు గల 10th Class ఒరిజినల్ సర్టిఫికెట్టు, గుంటూరు జిల్లాలోని.మండలకేంద్రమైన పెదనందిపాడులో, జిరాక్సు కాపీ తీయించుకుని, సదరు మండలములోని, పాలపర్రు గ్రామములో గల తన బంధువులయింటికి, బస్సులో ప్రయాణము చేయచుండగా పోయినవి. దొరికినవారు , యీ క్రిందిఫోను నెంబర్లకు తెలుపగలరు.

ఫోన్ నెంబర్లు: 9014845039, 8466810053.

NAME CHANGE

I PARIMI PADMA W/O SUBBA RAO, Resident of No. 3-33-120/a NGO Colony, Narasaraopet mandal , Palnadu district, A.P
Have changed my name from ADUSUMALLI PADMA (SSC certificate) to PARIMI PADMA (Aadhar card). Hence year after all my documents (Passport , Aadhar card etc .,) and Correspondence will continue with My Name
PARIMI PADMA W/O SUBBA RAO.

CHANGE OF NAME

I **SHABANA BEGUM SHAIK** (old name) W/o. Rahamatulla Shaik, resident of Door No. 7-160, Near Jenda Chettu, VVIT College Road, Nambur Village, Peda Kakani Mandal, Guntur District - 522508, I changed my name to **SHAIK SHABHANA** Henceforth, I will be known as
SHAIK SHABHANA

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం:49/2021

బిట్వీన్:
చందోలు వెంకట నరసింహ రావు ..... వాది
మరియు
కందుల వెంకటేశ్వర రెడ్డి, రిప్రజెంటెడ్ బై ఇట్స్, జి.పి.ఎ. హోల్డర్, అన్నపురెడ్డి వేమా రెడ్డి ...ప్రతివాది టు,
కందుల వెంకటేశ్వర రెడ్డి, రిప్రజెంటెడ్ బై ఇట్స్, జి.పి.ఎ. హోల్డర్, అన్నపురెడ్డి వేమా రెడ్డి, తండ్రి.చెన్నా రెడ్డి, చైతన్యపురి 3వలైను, సాయిబాబా రోడ్, గుంటూరు, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 15-02-2023 న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:15-02-2023

శ్రీమతి. యమ్.చారులత,
వాది తరపు అడ్వకేట్,
7/1 అరండల్ పేట, గుంటూరు.

Notice
IN THE COURT OF THE HON'BLE ADDL.SENIOR CIVIL JUDGE: NARASARAOPETA
I.P.No: 25 / 2021

Between:
Thurlapati Purna Chandra Rao and Others ... **Petitioners**
And
Garikapati Hanumantha Rao & Others ...**Respondents**

To,
R-1: Garikapati Hanumantha Rao, S/o.Venkateswarlu,R/o.Door No:1-186,A-Muppalla Village, Epuru Mandal, Guntur Dist.

పై నెంబరు I.P.పిటీషన్ లో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 01-03-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:01-03-2023

పదాల విజయ కిరణ్,
వంగా శ్రీనివాస రెడ్డి,
పిటీషనర్ తరపు అడ్వకేట్స్,
గుంటూరు,

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT :: GUNTUR
O.S. No. 148 OF 2022

BETWEEN:
Col. Sudhir Babu & Others ...Plaintiffs
AND
Sri. Harivaram Ramanjaneyulu & another ...Defendants

To
Sri. Harivaram Ramanjaneyulu S/o. Harivaram Vishweswara Rao Aged: 31 years, Occ: Business, R/o. Presently R/o. Flat No. 201, Vijaya Towers, 5/7th Line, Annapurna Nagar, Gorantla, Guntur City. Also at Door No. 9-16, Narayanapuram Post, Nadikudi, Dachepally Mandal, Guntur District, A.P.
Sirs,

Please take notice that above suit is filed for Specific Performance of Contract etc., and you are arrayed as Defendant No. 2 in the above suit proceedings and the matter is posted for your appearance on 10.03.2023. Therefore, you are hereby called upon to appear before the above Hon'ble court on **10.03.2023** at **10-30** A.M either in person or through your counsel or else matter will be heard in your absence.

(BY ORDER OF THE COURT)

M/s V.S. Sudhakar
Vikas Kumar
Advocates
O/o MS ASSOCIATES
PLOT NO.9, WEST MARREDPALLY,

IN THE COURT OF THE XXIX ADDL CITY CIVIL & SESSIONS JUDGE AT BENGALURU (CCH-30)
O.S. No. 7961/2019

BETWEEN: Arathi & others ... **PLAINTIFFS**
AND: Sri. Jayarama Reddy & others ... **DEFENDANTS**

ADDRESS FOR SERVICE OF SUMMONS DEFENDANT NO 25, 26

DEFENDANT No. 25: G. Hari babu, S/o G. Venkatappaiah, aged about 51 years, Flat No. 17, Maha Nilaya, Caitanyapuri, Dilshuk Nagar, Hyderabad, **DEFENDANT No. 26 L. Venkateswarlu**, S/o L. Ramanatham, aged about 50 years, No. 11/49, Janapadu Main Road, Piduguralla Guntur District, Andhra Pradesh.

NOTICE

Whereas the plaintiffs have filed the above suit for partition and separate possession and other reliefs against you and others in respect of the schedule property. It is stands posted on **06-03-2023** you are hereby summoned to appear on that day at 11A.M. before the Hon'ble City Civil Court (CCH-30) in person or through duly instructed advocate, failing which the matter will be decided exparte.

SCHEDULE PROPERTY

Item No.1: All the piece and parcel of the property bearing Old Sy. No. 17/5, New Sy. No. 17/5A2, measuring 1 acre 02 guntas, situated at Doddakannahalli Village, Varthur Hobli, Bangalore East Taluk, Bangalore and bounded on: **East by:** Bangalore Salem Railway Lane, **West by:** Land belongs to Munipatalappa, **North by**: Land bearing Sy No. 17/4A, **South by:** Land belongs to Emmanuel Thomas

Item No.2. All the piece and parcel of the property bearing Sy. No17/4A,measuring 01 acre 08 guntas situated at Doddakannahalli Village, Varthur Hobli, Bangalore East Taluk, Bangalore and bounded on: **East by:** Bangalore-Salem Railway Lane, **West by:** 30 feet Road, **North by:** Land belongs to Avalahalli Muniyappa & K.N. Venugopal, **South by:** Land bearing Sy.No. 17/5A2.

Given under my hand and the seal of this court this 03-02-2023.

By order of the court, Assistant Registrar, City Civil Court, Bangalore.

Advocate for Plaintiff: **A. SOMARAJU**
Address No.16, Basement Amar Towers, Gandhinagar, Bangalore-560009.

ఆగస్టు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభిమాని ఆగస్టు మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సిపిఎం అభిమాని సాతులూరి ఆగస్టు (68) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమర్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆగస్టు అంత్యక్రియలు మంగళవారం నిర్వహించగా భౌతికకాయాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాలలేసి నివాలులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఆగస్టు చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఎస్.లూథర్, వీరబాబు, ఎస్.ప్రభాకర్, ఎస్.ప్రకాష్, కోట నాయక్, ఎం.విల్సన్ ఉన్నారు.

ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన బోర్డు సభ్యులు

సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సభ్యులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. బోర్డ్ సెక్రటరీ అజయ్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ప్రధాన డ్యామ్, కుడి కాల్వ హెడ్ రెగ్యూలేటర్, జలవిద్యుత్ కేంద్రం, ఎడమ కాల్వ హెడ్ రెగ్యూలేటర్, జలవిద్యుత్ కేంద్రాలను, క్రస్ట్ గేట్లను, 220,420 గ్యాలరీల పనితీరును పరిశీలించారు. అనంతరం విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో నాగార్జున కొండకు వెళ్లారు. ఎస్ఇ అశోక్ కుమార్, ఇఇలు శివ శంకరయ్య, రంగనాథ్, డిఇలు మురళీధర్, సుదర్శన్, శ్రీనివాస్, జెఇలు కోటేశ్వరరావు, కృష్ణయ్య, డ్యామ్ ఆర్ఐ భాస్కర్, లాంచీ స్టేషన్ మేనేజర్ స్వామి, ఎస్పీఎఫ్ ఎస్ఐ విజయ్ కుమార్, వినయతుల్లా పాల్గొన్నారు.

నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ధనలక్ష్మి విద్యార్థులు

ప్రజాశక్తి-ఈపూరు

ఎంపికైన జి.సాల్మన్‌రాజు, ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, కె.భానుప్రకాష్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషుల నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి కళాశాల విద్యార్థులు జి.సాల్మన్‌రాజు, ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, కె.భానుప్రకాష్ ప్రతిభ చూసి తృతీయ స్థానం సాధించారని, వీరు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఈనెల 14-17 తేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులోని స్టేట్ లా యూనివర్సిటీలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాం నాయక్, ఎం.సురేష్ కుమార్, ఎం.దాసు అభినందించారు.

ఆదాయం పెంచడానికే లీజుకు స్థలాలు

- ఆర్టీసీ ఆన్‌లైన్ టిక్కెట్లతోపాటు దర్శనం టిక్కెట్లు
- శివరాత్రి ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను పెంచబోము
- ఆర్టీసీ ఎమ్‌డి ద్వారాకా తిరుమలరావు
- సత్తెనపల్లి, వినుకొండ డిపోల్లో పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్, వినుకొండ

ఆదాయాన్ని పెంచుకోవడానికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజుకిస్తున్నట్లు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు చెప్పారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, వినుకొండ ఆర్టీసీ డిపోలను ఆయన మంగళవారం సందర్శించారు. గతంలో ఆర్టీసీకి నీటిని సరఫరా చేసిన సత్తెనపల్లి నాగార్జున నగర్‌లోని రెండు సెంట్లలో ఉన్న ఆర్టీసీ బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు పాత బకాయిలు చెల్లించాల్సి ఉన్నందున స్థలాలను దీర్ఘకాలానికి లీజుకు ఇస్తున్నామన్నారు. గతంలో 33 ఏళ్లున్న లీజు ఒప్పందాన్ని కుదించే అవకాశం ఉందని, కొందరు 15 లేదా 25 ఏళ్లకు ఇస్తే ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయగా దీనిపై త్వరలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆదాయం ఉంటే బస్సు సర్వీసు ఎక్కడికైనా వేయగలమని, చెన్నయ్, వైజాగ్ లాంటి పట్టణాలతో పాటు వివిధ నగరాలకు బస్సు సర్వీసులు నడుపుతామని అన్నారు. కోటప్పకొండ తిరునాళ్లకు సత్తెనపల్లి, నరసరావుపేట, పిడుగురాళ్ల, వినుకొండ డిపోల నుండి బస్ సర్వీసులు వేస్తామన్నారు. డీజిల్ ధరలు పెరిగినా శివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలకు నడిపే బస్సులకు ఛార్జీలు పెంచడం లేదని అన్నారు. తిరుపతి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి 1075 దర్శనం టిక్కెట్లు

వినుకొండ డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌టిసి ఎమ్‌డి

అందుబాటులో ఉంచామని, ఈనెల 9వ తేదీ నుండి శ్రీశైలానికీ మూడు రకాల దర్శనం టికెట్లు ప్రవేశ పెట్టామని వివరించారు. ఈ విధానం విజయవంతం అయితే రెండు మూడు నెలల్లో రాష్ట్రంలోని ప్రముఖ క్షేత్రాలైన కాణిపాకం, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ తదితర ఆలయాలకూ అమలు చేస్తామని వివరించారు. రాష్ట్రంలో 11 వేల బస్సులు ఉండగా వీటిలో 2500 అద్దె బస్సులని, కొత్తగా స్టార్‌లైన్ బస్సులు అందుబాటులోకి తెచ్చామని, త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు కోనుగోలు చేసే యోచనలో ఉన్నామని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలనూ సత్వరమే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, వినుకొండ ఆర్‌టిసి డిపో మేనేజర్లు జి.విజయ్‌కుమార్, కోటేశ్వర నాయక్, అధికారులు కె.బ్రహ్మారెడ్డి, ఆదంసాహెబ్, ఎన్.వి.శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్గో బాధితుడు ఫిర్యాదు..

వినుకొండ కార్గో పార్సిల్ సర్వీస్ ద్వారా తాను బియ్యం పంపించగా అవి గమ్య స్థానానికి చేరలేదని, దీనిపై అడిగితే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్‌డికి శావల్యాపురం మండలం ఎర్లపాడు గ్రామానికి చెందిన కొర్రపాటి రవి ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా పాలపాడుకు వినుకొండ ఆర్టీసీ కార్గో పార్సిల్ నుండి 25 కిలోల ఆర్గానిక్ బియ్యం బస్తాలు జనవరి 11న బుక్ చేశామని, అవి ఇప్పటికే చేరలేదని తెలిపారు. గతంలో 85 కిలోల బియ్యం బస్తాలు ఇలానే పార్సిల్ చేసినా వెళ్లలేదన్నారు. ఈ సమస్యను రెండు గంటల్లో పరిష్కరించాలని నిర్వాహకులను ఎమ్‌డి ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వ్యవసాయానికి బడ్జెట్ కోతపై రేపు ధర్నా

ప్రజాశక్తి - నరసరావుపేట

రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని, వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని చెప్పిన మోడీ వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టారని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు విమర్శించారు. ఇటీవల కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో స్థానిక మొదటి రైల్వే గేటు వద్ద గల తపాలా శాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేస్తామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకున్న వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ఎరువుల రాయితీల్లో భారీగా కోత విధించారని, పోలవరం ప్రాజెక్టు నిధులివ్వలేదని, పల్నాడు జిల్లాకు కీలకమైన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించారని విమర్శించారు. దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలనూ అమలు చేయడం లేదని, ఈ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే ధర్నాలో అన్ని రంగాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య

'పది'లో నూరుశాతం ఫలితాలు తేవాలి

ఉపాధ్యాయులకు శిక్షణ, సమీక్షలో డిఇఒ

ప్రజాశక్తి - రెంటచింతల

విద్యార్థులకు పదో తరగతిలోనే బలమైన పునాదులు వేస్తే వారి భవిష్యత్ బాగుంటుందని ఉపాధ్యాయులకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య చెప్పారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని ఉపాధ్యాయులకు మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయిట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఒక్కరోజు శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి వరకూ బోధించిన పాఠ్యాంశాలపైనా సమీక్షించారు. కార్యక్రమానికి సత్తెనపల్లి డిప్యూటీ డిఇఒ వి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని, నూరు శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోనే 10వ తరగతి పరీక్షలు రాయబోయే వారు 4079 మంది, గురజాల నియోజకవర్గంలో 4312 మంది ఉన్నారని తెలిపారు. వీరికి బోధించే ఉపాధ్యాయులకు ఉదయం, సాయంత్రం టి, స్నాక్స్ అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో ఎంఇఒలు వెంకటేశ్వరరావు, సురేషు, నాగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ కింద రూ.8.29 కోట్లు

రెంటచింతల ఎంపిపి చౌడేశ్వరి

ప్రజాశక్తి - రెంటచింతల

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చౌడేశ్వరి

జల జీవన్ మిషన్ రెండో విడత కింద మండలానికి 8.29 కోట్లు విడుదలైనట్లు ఎంపిపి దాసరి చౌడేశ్వరి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 9609 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ కృష్ణారెడ్డి చెప్పగా ఉపాధి హామీ కూలీలు జాబ్ కార్డుతో తమ ఆధార్‌ను అనుసంధానించుకోవాలని ఎపిఒ జయచంద్ర కోరారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లో జిల్లాలోనే రెంటచింతల ముందంజలో ఉందని ఎంపిడిఒ గౌసియా బేగం తెలిపారు. మంచికల్లు, మెట్టుగుడిపాడు, పాలువాయి తదితర గ్రామాల్లో ఘన వ్యర్థాల షెడ్లు నిర్వహణకు ప్రతిపాదనలు పంపినట్లు గృహ నిర్మాణ శాఖ ఎఇ శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, వైఎస్ ఎంపిపి మాచర్ల అచ్చమ్మ, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

రెండో రోజుకు వైవి ఆంజనేయులు పాదయాత్ర

ప్రజాశక్తి - నకరికల్లు

అభివాదం చేస్తున్న వైవి ఆంజనేయులు

నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు చేపట్టిన పాదయాత్ర రెండోరోజైన మంగళవారం నకరికల్లు మండలం కండ్లగుంట నుంచి బినరసింగపాడు వరకు సాగింది. తొలుత కండ్లకుంటలోని ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాద్, కోడెల సత్యనారాయణ విగ్రహాలకు వైవి ఆంజనేయులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రకు పలుచోట్ల మహిళలు, టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. చీమలమర్రి, చల్లగుండ్ల, నకరికల్లు, గ్రామాల్లో టిడిపి శ్రేణులు పాదయాత్రలో కలిసి నరసింగపాడు వరకు నడిచారు. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి తీర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర భవిష్యత్తును కాపాడడానికి లోకేష్ పాదయాత్ర చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.కోటేశ్వరావు, నాయకులు టి.వెంకట్రావు, ఎన్.జానకిరామయ్య, పి.రాంబాబు, బి.గంగయ్య, రంగయ్య, డి.హుస్సేన్‌బి, డి.రాందాస్ పాల్గొన్నారు.

గరళాన్ని తలపిస్తున్న రక్షిత నీరు

నిత్యం పైపులైన్ల లీకులు - శాశ్వత మరమ్మతులు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-తెనాలి:

రక్షిత మంచినీరు... పట్టణంలో ఈ పేరు వింటేనే భయపడాల్సి వస్తోంది. ఎందుకంటే ఎక్కడ పడితే అక్కడ రోజుల తరబడి పైప్ లైన్ లీకులు.. నిత్యం మరమ్మతులు... అధి కూడా తాత్కా లికమే. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయరు. ఫలితం గా కోట్లాదిరూపాయల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన పథకం నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పురపాల క సంఘం అందించే తాగునీరు గరళంలా ప్రజలను భయపె డుతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణ సుందరీకరణ, అభివృద్ధి జపం చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు రక్షిత మంచినీటి సరఫరాలో లోపాలను సరిచేయలేకపోతున్నారు. దాదాపు రెండు లక్షల జనాభా కలిగిన పట్టణంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దాదాపు రూ.100కోట్ల పైచిలుకు నిధులతో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటైంది. కృష్ణా నది నుంచి పైప్‌లైన్ సాయంతో పట్టణానికి నీటని తరలించారు. తదుపరి తెలుగుదేశం, వైసిపి అధికారంలోకి వచ్చినా పనులు సాగక, పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా లేదు. కొన్ని ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లు కూడా పెండింగే. మూడు ప్రభుత్వాలు మారినా రక్షిత మంచినీటి సరఫరాను అధికారులు క్రమబద్ధీకరించలేపో తున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ పైప్‌లైన్‌లు లీకౌతున్నాయి. రోజుల తరబడి తాగు నీరు వృధా అవుతోంది. విస్సార్ కళాశాల నుంచి ఐతానగర్ వెళ్లే రోడ్డులో ఇది నిత్యకృత్యంగా చెప్పవచ్చు. కళాశాల గేటు సమీపంలో రోడ్డు కుంగి పైప్‌లైన్ లీకవుతోంది. తరచుగా జరుగుతున్న ఈ పరిణామంపై స్థానికులు పిర్యాదు చేయటం, తూతూ మంత్రంగా మరమ్మతులు చేయటం పరిపాటిగా మారింది. ఇదే రోడ్డులో కోళ్ళ ఫారం దాటిన తరువాత చిన్న మలుపులో నెలల తరబడి పైప్ లైన్ లీకైంది. చివరి రోడ్డు కుంగి పోయి, పెద్ద పెద్ద గుంతలు పడితే గాని అధికారులు సరిచేయలేదు. అన్నింటికంటే ముఖ్యమేమంటే విస్సార్ కళాశాల గేటు సమీపలో మంచినీటి పైప్‌లైన్ జంక్షన్‌పై ఓ ఇనుపరేకును ఉంచారు. అది కూడా కుంగి పోయింది. ఈ రోడ్డులో ఏదైనా బారీ వాహనం దానిపైకి ఎక్కితే దిగబడిపోవటం ఖాయం. పైగా రేకుకు నాలుగు వైపులా కాళీ ఉంది. నీరు బయటకు కనిపిస్తుంది. ఆకతాయిలు వ్యర్థాలు వేసేందుకు అవకాశం ఉంది. వేయకూడనివి దీనిలో ఏవైనా పడితే ఆ నీరు ఎంత ప్రమాదకరమో చెప్పలేం. ఇటీవలి కాలంలో రూరల్ గ్రామం కొలకలూరులో నీరు కలుషితం కారణంగా డయేరియా ప్రభలి ఓ బాలిక మృతి చెందటం, దాదాపు 200 మంది గ్రామస్తులు ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. అలాంటి ఘోరమైన ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, మరమ్మతులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు

వాటర్ పైప్ జంక్షన్ పాయింట్‌పై ప్రమాదభరితంగా రేకు ప్లేటు

-ఇటీవల పైప్‌లైన్ లీకై వృధాగా పోతున్న తాగునీరు(ఫైల్‌ఫోటో),

లీకుల కారణంగా దెబ్బతిన్న రోడ్డు

రేపు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద బ్లాక్ డే నిరసన

జయప్రదం చేయాలని రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 9న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించారన్నారు. ఈ బడ్జెట్ వలన రైతుల ఆదాయాలు ఏ విధంగా పెరుగుతాయని ఆయన బడ్జెట్లో పీఎం కిసాన్ నిధికి రూ.12,950 కోట్లు ఉంటే రూ.10వేల787 కోట్లకు తగ్గించారన్నారు. వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి వ్యవసాయ సంక్షోభం ఏ రకంగా నివారిస్తారని ఆయన విమర్శించారు. పీఎం కిసాన్ పథకం కింద ఇచ్చే రూ. 6వేలు ఏ మాత్రం చాలడం లేదని, రైతులకు వ్యవసాయ ఖర్చులు రెట్టింపు అయ్యాయన్నారు. ఒకవైపున లక్షలాది మంది రైతులు ఆత్మహత్యల పరంపర కొనసాగుతూ ఉంటే, మరోవైపు స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలను ఇస్తామని చెప్పిన ప్రధాన మంత్రి ఆ ఊసే ఎత్తడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఎరువులు, ధాన్యం సబ్సిడీలు తగ్గించారని, బిజెపి విధానాలు కార్పొరేట్ శక్తుల అభివృద్ధి కొరకే తప్ప, ప్రజల కొరకు కాదన్నారు. ఈ క్రూరమైన రైతు, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 9వ తేదీన బ్లాక్ డేని పాటించాలని కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలోని బిఎస్ఎన్ఎల్, పోస్ట్‌ఆఫీస్ ల ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామ కష్ణయ్య, బి శివారెడ్డి, మంగళగిరి మండల రైతు నాయకులు మొసలి జ్యోతిబస్, కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

26న చిలుమూరులో ఐద్వా వజ్రోత్సవ సభ

జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి అరుణ పిలుపు

ప్రజాశక్తి - దుగ్గిరాల :దుగ్గిరాల మండలం చిలువూరులో 26వ తేదీన ఐద్వా వజ్రోత్సవ సభ నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ తెలిపారు. సోమవారం దుగ్గిరాలలో సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1947 ఫిబ్రవరి 15,16 తేదీలలో వేలాది మంది మహిళలను సమీకరించి చిలువూరులో ప్రథమ ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ నిర్వహించారని తెలిపారు. ఆమహాసభ స్ఫూర్తితో 26న మహిళాసంఘం వజ్రోత్సవ సభ నిర్వహిస్తుందని తెలిపారు. ఆ మహాసభలో నిబంధనలు, మహిళల హక్కులు, విధులు తదితర అంశాలు చర్చించారన్నారు. మానవ జాతి అభివృద్ధికి స్వాతంత్ర్యం, సమానత్వం చాలా అవసరమని, స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమని, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో మహిళలు నాటి అమానవీయ పరిస్థితులను దాటుకుని ఉద్యమాల్లో భాగమయ్యాం'న్నారు. నాటి సహాయ నిరాకరణ ఉద్యోమంలో నడుం కట్టి పాల్గొన్నారన్నారు. వందలాది మంది మహిళలు జైళ్లకు వెళ్లారని, ఎండనక, వాననక విదేశీవస్తు బహిష్కణ అమలులో ఆందోళనలు చేశారన్నారు. అప్పటి బ్రిటీష్ పోలీస్‌లు , మహిళా ఉద్యమాన్ని నీరు కార్చడానికి చేసిన వేధింపులను ధైర్యంగా తిప్పికొట్టారన్నారు. ఆ తరగని స్ఫూర్తితో మహిళా సంఘం నేటికీ మహిళల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. నాటి నుండి నేటి వరకు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నప్పటికీ, నేటికీ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళా బిల్లు ఇంతవరకు పార్లమెంట్‌లో అమలుకు నోచుకోలేదన్నారు. మహిళలు, వృద్దులు, చిన్నపిల్లలు ఒంటరిగా వెళ్లే పరిస్థితులు నేటికీ లేవన్నారు. మతోన్మాద బిజెపి అధికారంలోని వచ్చాక మనువాద సిద్ధాంతం మహిళలపై రుద్దుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో 1947 ఫిబ్రవరి నెలలో 15,16 తేదీలలో నిర్వహించిన ఆంధ్రమహిళా మహాసభ స్ఫూర్తిని మరోసారి మననం చేసుకోవడానికి 75 సంవత్సరాల తరువాత ఫిబ్రవరి 26న ఆదివారం చిలుమూరులో వజ్రోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎస్ సలీమా, స్వర్ణ, గౌరి, తనూజ, నాయకులు వైబ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ

12న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు రమేష్ హాస్పటల్ వారు తమ హాస్పటల్ 24వ వార్షికోత్సవ సందర్భంగా పెదనందిపాడు పిఏఎస్ కళాశాల పాలకవర్గం సహకారంతో ఈనెల 12వ తేదీన కళాశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వెలవర్తి కార్తీక్ మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ జనరల్ డాక్టర్లు. స్త్రీ ప్రసూతి నిపుణులు, మెదడు వెన్నుముక కండరాల కు సంబంధించిన డాక్టర్లు, ఊపిరితిత్తుల నిపుణులు, షుగర్ బిపి. నివారణ డాక్టర్లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి మమత, కళాశాల పాలకవర్గ కోశాధికారి లావు ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య, ఎన్.సి.సి అధికారి పాతూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో కెఎల్‌యు విద్యార్థికి స్వర్ణం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :కెఎల్ విశ్వవిద్యాలయంలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె,హర్షవర్ధన్ అంతర్జాతీయ జూనియర్ కరాటే పోటీలో లో బంగారు పతకాన్ని సాధించినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 3 నుండి 5 వరకు విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ జూనియర్ అండర్ 17 కరాటే పోటీలలో 7దేశాలు పాల్గొనగా ప్రథమ స్థానాన్ని సాధించిన హర్షవర్ధన్ బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ హర్షవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్, వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ , విద్యార్థి వ్యవహారాల డీన్ చప్పిడి హనుమంతరావు, క్రీడల విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ కె సుజాత తదితరులు కె.హర్షవర్ధన్ ను అభినందించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

శ్మశాన స్థలాలు ఏర్పాటుకు జెసి ఆదేశం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలంలోని బేతపూడి, గుండాలపాడు గ్రామ అగ్రహారంలో నివసిస్తున్న మాల దాసు ఎస్సీలకు స్మశాన స్థలాలు లేవని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సమస్యపై ప్రజాశక్తి పేపర్‌లోకూడా సమగ్రంగా రాశారు. ఈక్రమంలో మంగళవారం జెసి శ్మశాన సమస్య ఉన్న ఫిరంగిపురం మండలం గుండాలపాడు, బేతపూడి గ్రామాలను సందర్శించారు. బేతపూడి గ్రామంలో 150 కుటుంబాలకు, గుండాలపాడు అగ్రహారంలో 100 కుటుంబాలకు క్రొత్తగా స్మశాన స్థలం అవసరమని ఈ సందర్భంగా గుర్తించారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వం భూములను పరిశీలించి సర్వే చేసి నివేదికను పంపించవలసినదిగా తహశీల్దార్, సర్వేయర్‌ను ఆదేశించిరు. గ్రామస్తులకు విషయాని తెలియపరచి, త్వరలోనే రెండు గ్రామాల వారికి స్మశాన స్థలాలను కేటాయిస్తామని ఆమె తెలిపారు. అలాగే బేతపూడి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ డి పద్మనాభుడు, బేతపూడి విఆర్ఒ, షేక్ సుభాని, గుండాలపాడు విఆర్ఒ జి జాన్ డెక్కన్ ఇరుగ్రామాల సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

70 ఏళ్లొచ్చినా పనికి పంపిస్తున్నారు..

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం - కాపాడిన హెడ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి - ముప్పాళ్ల

కాల్వలో నుండి వృద్ధురాలిని తీసుకొస్తున్న హెడ్‌కానిస్టేబుల్

ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధురాలిని ముప్పాళ్ల పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మక్కెన మాధవరావు కాపాడారు. తనను కొడుకులు పట్టించుకోవడం లేదని, పనులకు పంపిస్తున్నారనే ఆవేదనతో చాగంటివారిపాలేనికి చెందిన 70 ఏళ్ల ధర్మరాజుల సుబ్బులు ఎన్‌ఎస్‌పి కార్యాలయం వద్ద గల పెదనందిపాడు కెనాల్‌లో దూకారు. ఎస్‌ఐ పట్టాభిరామయ్య ద్వారా సమాచారం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ మాధవరావు వెంటనే స్పందించి గంటసేపు కాల్వలో గాలించారు. కాల్వకు అనుకుని ఉన్న తూటికాడలో ఇరుకుపోయిన సుబ్బులును కాపాడారు. అనంతరం ఆమె కొడుకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వృద్ధురాలి ప్రాణాలను కాపాడిన మాధవరావును పలువురు అభినందించారు.

రమాభాయికి నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సతీమణి రమాభాయి అంబేద్కర్ 125వ జయంతి సభను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యములో మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు జె.పాల్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకోర్చి అంబేద్కర్‌కు దన్నుగా నిలిచిందని, పుట్టిన బిడ్డలు వరుసాగా చనిపోతున్నా మొక్కవోని విశ్వాసంతో నిలబడిందని చెప్పారు. ఇదే క్రమంలో పిడకలను చేసి వాటిని అమ్మడం ద్వారా అంబేద్కర్ చదవుల కోసం అవసరమైన డబ్బును సమకూర్చారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కె.దేవానంద్, శ్రీనివాస్, సిహెచ్.విక్టర్, జి.ఆశీర్వాదం, కె.జాన్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి

పని చేసే వారికి మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పనితీరు మరింతగా మెరుగు పరుచుకోవాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్‌ఒ) శోభారాణి సూచించారు. మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశాడేలో డిఎంహెచ్‌ఒ పాల్గొని మాట్లాడారు. పని చేసే వారిని మరింతగా ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వెలుగొండరెడ్డి, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

టిడిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బర్న

ప్రజాశక్తి - నూజెండ్ల

బర్నను అభినందిస్తున్న జీవీ ఆంజనేయులు తదితరులు

టిడిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షునిగా కట్టెంపూడి బర్న నియమితులపయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించిన టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు. బర్నకు టిడిపి మండల అధ్యక్షులు మీసాల మురళి యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

10 నాటికి అమృత్ ట్యాంకులను పూర్తి చేయాలి

సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సమీక్షలో పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సంక్షేమం, అభివృద్ధి పథకాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ కోరారు. ఈ మేరకు అధికారులతో కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మంగళవారం సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్ ఇకెవైసిపిని నూరు శాతం పూర్తి చేయాలని,. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పకడ్బందీగా పరిశీలించాలని చెప్పారు. కూలీలకు సంబంధించి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలకు, పోస్ట్ ఆఫీసులకు అనుసంధానించాలన్నారు. ఎన్‌ఎంఎస్ యాప్‌ను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. అమృత్ సరోవర్ ట్యాంకును 10వ తేదీ లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప పథకంలో వర్మీ కంపోస్ట్ షెడ్డుల నిర్వహణపై వివరాలడిగారు. క్లాప్ మిత్ర హాజరును ఈవోపీఆర్డీలు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి గ్రామంలో చెత్త సేకరణ సజావుగా జరిగేలా చూడాలన్నారు. 100 శాతం చెత్త సేకరణ స్వీకరించడంతో పాటు, వాటిని వేరుచేసి వర్మీ కంపోస్టు తయారీకి, రైతులకు అమ్మడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం పనులు సకాలంలో పూర్తిచేసేలా స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని, సుస్థిరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 10-19 ఏళ్ల కౌమార దశలోని యువకుల, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్యపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించడంతో పాటు, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో నిరుద్యోగ యువత ఎంతమంది ఉన్నారు? ఎంత మందికి ఉపాధి అవకాశాలు అవసరం? ఉద్యోగాలు వ్యాపార అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై సర్వే చేయాలన్నారు. మండలాల్లో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ నూరుశాంత పూర్తయ్యేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీఎస్, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో తాగునీటి నమూనాలను గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎఇలు, మండల వైద్యాధికారులు సేకరించి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయించాలని ఆదేశించారు. అధికారులంతా క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ, పనులు వేగవంతం చేయాలన్నారు.

రహదారి విస్తరణపై పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

రైతుల ఫిర్యాదుపై పరిశీలన

జాతీయ రహదారి 167 విస్తరణలో భాగంగా కేశనపల్లి, రావిపాడు, జొన్నలగడ్డ, నరసరావుపేట ప్రాంత ప్రజలు, రైతులు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల తమ సమస్యలను విన్నవించారు. వీటిపై పరిశీలన నిమిత్తం కలెక్టర్ ఎల్.శివశంకర్, జెసి ఎ.శ్యాంప్రసాద్ ఆయా గ్రామాలను మంగళవారం సందర్శించారు. రోడ్డు విస్తరణ స్థలాన్ని పరిశీలించారు. రైతులు ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని, ప్రజలకు ఇబ్బంది లేకుండా రహదారణ నిర్మాణం జరిగేలా, ప్రత్యామ్నాయ చర్యలను పరిశీలించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు.

సందర్శకులకు ఇబ్బందుల్లేకుండా పనులు

- కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే
- రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులు 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే సందర్శకులకు ఇబ్బందులేమీ కలగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. కోటప్పకొండ వెళ్లే పలు రోడ్డు మార్గాలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కొండ పైన, కింద భాగాల్లో చేపట్టాల్సిన పనులపైనా సమీక్షించారు. 12వ తేదీ నాటికి పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. తురకపాలెంలో నిర్మిస్తున్న బ్రిడ్జి, తాగునీరు, అన్నదాన ఏర్పాట్లు, డార్మెటరీ రూములు, సందర్శకుల కోసం నిర్మాణంలో ఉన్న అతిథి గృహాలను, కోటప్పకొండ దిగువ భాగంలో సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. ఈ పనులు 15వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తవ్వాలని స్పష్టం చేశారు. తిరునాళ్ల ఏర్పాట్లు, నిర్వహణపై మూడో విడత మరోసారి సమీక్షిస్తామని చెప్పారు. పరిశీలనలో జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, కొండకావూరు. పమిడిమార్రు సర్పచ్‌లు వి.నాగిరెడ్డి, డి.శ్రీనివాసరావు, నాయకులు వి.జాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలపై రేపు సమీక్ష

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని కష్ణా నది ఒడ్డున గల సత్రశాల ఆలయంలో ఈ నెల 18న నిర్వహించే మహాశివరాత్రి వేడుకలపై సమీక్ష సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.పుల్లారావు మంగళవారం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి హాజరవుతారని, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

మొక్కజొన్న పొలాలను పరిశీలిస్తున్న ఏవో తదితరులు

పొలాల్లో ఏవో పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.రామారావు సూచించారు. మండలంలోని చిట్టాపురం, ఎ.ముప్పాళ్ల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. రైతు భరోసా కేంద్రం ఛానల్ ద్వారా రైతులకు నేటి పద్ధతులలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కియోస్కో పనితీరు ఎరువులు ఆన్‌లైన్‌లో పొందడం పై వివరించారు. అనంతరం వరి, మొక్కజొన్న పొలాలను పరిశీలించి సస్య రక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో నబీ, గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్ తిరుమల, ఆర్.శివ గాయత్రి పాల్గొన్నారు.

బేస్‌బాల్ వర్సిటీ జట్టుకు అయ్యప్ప ఎంపిక

ప్రజాశక్తి-ఈపూరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల నాలుగో తేదీన జరిగిన అంతర్ కళాశాలల బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి కళాశాల విద్యార్థి డి.అయ్యప్ప ప్రతిభ కనబరిచి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఈ విద్యార్థి 14-18వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని రాయల్ గ్లోబల్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో వర్సిటీ జట్టుకు అయ్యప్ప ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాం నాయక్, ఎం.సురేష్ కుమార్, ఎం.దాసు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి సహకరించండి

ప్రజాశక్తి - బెల్లంకొండ

అవగాహన కల్పిస్తున్న పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు

మానవ అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మండల కేంద్రమైన బెల్లకొండలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. క్యాపిటల్ ఏరియా కౌన్సిల్ ఆఫ్ సొసైటీ అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ చదువు లేని పేదవారికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గ్యాంగ్లు మాయ మాటలు చెప్పి వారి పిల్లల్ని, మహిళల్ని మోసం చేస్తున్నారని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. మిస్సింగ్ కేసులు, మానవ అక్రమ రవాణా నిరోధానికి పోలీసులు, స్వచ్ఛ సంస్థలతో అందరూ సహకరించాలని, ఇలాంటి సమాచారం తెలిస్తే వెంటనే చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో జెడపి పాఠశాల హెచ్ఎం తిరుమలరావు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పల్నాడు ఎస్ఐ అల్లూరి రెడ్డి, న్యూ విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డి.ఏడుకొండలు, దిశా ఫౌండేషన్ చైర్మన్ అనురాధరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్ సమీక్ష

ప్రజాశక్తి - ముప్పాళ్ల : సచివాలయ సేవలపై గ్రామ రెవెన్యూ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ భవానీశంకర్ చెప్పారు. సచివాలయ గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్‌లతో తన కార్యాలయంలో తహశీల్దార్ మంగళవారం సమీక్షించారు. రెవెన్యూ సేవల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్జీలను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. భూముల రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఎఎస్ఒ అనూష పాల్గొన్నారు.

కొడుకు బాలసుబ్రహ్మణ్యంతో తల్లి పల్లపు వీరమ్మ

15 ఏళ్లొచ్చినా రేషన్ కార్డులో పేరు ఎక్కించడం లేదు

ప్రజాశక్తి- పెదనందిపాడు

15 ఏళ్ల వచ్చిన తన కుమారుడి పేరు రేషన్ కార్డులో ఎక్కించడం లేదని, కాళ్ల అరిగేలా తిరుగుతున్నామని పెదనందిపాడు సచివాలయం -2 పరిధిలో నివసిస్తున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన పల్లపు వీరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు పల్లపు బాలసుబ్రమణ్యం (15) పేరు రేషన్ కార్డులో ఇంకా ఎక్కలేదని, ఆరు నెలల నుండి అధికారుల చుట్టూ పనులు మానుకొని తిరుగుతున్నామని తెలిపారు. ఇటీవల డెంగ్యూ జ్వరంతో కుమారుడు ఆసుపత్రిపాలైతే రూ. 60 వేలు ఖర్చు అయ్యాయని, ఆరోగ్యశ్రీ లేకపోవడం వల్ల మొత్తం చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ఇళ్లల్లో కూలి పనులు చేసుకుంటేనే తమకు జీవనమని, ప్రభుత్వ పథకాలు వర్తించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ కుమారుడు పేరు రేషన్ కార్డులో త్వరగా ఎక్కించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత విఆర్ఓ సుధాకర్‌ను సంప్రదించగా వాలంటీరు ఈ- కేవైసీ చేస్తే తాము ప్రాసెస్ చేస్తామని తెలిపారు. సంబంధిత వాలంటీర్ కల్పన కార్యాలయంలో కానీ, ఫోనులో సంప్రదించడానికి కాని అందుబాటులో లేదు.

మాస్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ పోలీస్ బృందం

ఆలయంలో ఆక్టోపస్ పోలీస్ బృందం మాక్‌డ్రిల్

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం ఆక్టోపస్ పోలీస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. భవిష్యత్తులో ఆలయంలో ఏ విధమైన అపాయం వచ్చిన వాటిని సమగ్రంగా ఎదుర్కొనేందుకు పారో 3డి లేజర్ స్కాన్ అనే ఆధునికతమైన పరికరాల ద్వారా టెక్నికల్ రెక్కీ నిర్వహించారు. ఆక్టోపస్ డిఎస్పి వి.గణేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ కేవివి ప్రసాద్, ఎస్ఐలు బాల హుస్సేన్, అనిల్ కుమార్, ఆలయ ఈఓ ఏ. రామకోటిరెడ్డి, పోలీస్ సిబ్బంది, ఆక్టోపస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరంజీవికి అభినందనలు తెలుపుతున్న శివశంకరరావు

ఆప్కో చైర్మన్ చిరంజీవికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని మాజీ అఖిలభారత చేనేత బోర్డు డైరెక్టర్ అందే శివశంకరరావు మంగళవారం ఆయన నివాసములో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అందే రేవంత్ కుమార్ పాల్గొన్నారు.

సంచార పశు ఆరోగ్య రథ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి -దుగ్గిరాల

పశువులకు, అన్ని రకాల జీవాలకు ఎటువంటి అనారోగ్యానికి గురైన వెంటనే 1962 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సంచార పశు ఆరోగ్య రథ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైతులను కోరారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం సంచార పశు ఆరోగ్య సేవా రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్దకే వాహనాన్ని పంపించే పథకాన్ని ప్రారంభించిందన్నారు. సుమారు రూ. 36 లక్షల వ్యయంతో వాహనం ప్రతి మండలానికి ఒకటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. పశువైద్యశాఖ ఏడిఏఆర్ అపర్ణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ వాహన సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వాహనంలో ఒక డాక్టర్‌తో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం పశువులు ఉన్న రైతులతో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేయించి జండాను ఊపి వాహనాన్ని

సంచార పశు ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎంపీపీ డి. సంతోష్ రూపవాణి, జడ్పిటిసి ఎం అరుణ, యార్డు చైర్మన్ షేక్ బాజీ ,సర్పంచ్ మెగావత్ కుషిబాయి, తహశీల్దార్ కే మల్లేశ్వరి, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి,పెద్దపాలెం సర్పంచ్ పి. కృష్ణ ప్రసాద్, ఎం. సర్పంచ్ యార్లగడ్డ చిన్న పేరుకులపూడి సర్పంచ్ జి. గంగాధర్ ,రేవేంద్రపాడు సర్పంచ్ పి. శామ్యూల్, స్థానిక నాయకులు కంభంపాటి క్రాంతి కుమార్, మెగావత్ వెంకటేశ్వర నాయక్, షేక్ నాగూర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతక్కిలో కెనడా బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న కెనడా బృందం

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించేందుకు కెనడా బృందం మంగళవారం పర్యటించింది. అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పొలాలను పరిశీలించి తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ఆహార ఉత్పత్తి సంస్థ ప్రజెంట్ ఫుడ్స్, ఆహార ఉత్పత్తుల తయారీలో అత్యధిక షేర్ మార్కెట్ కలిగిన మెక్కేయిన్ ఫుడ్స్ తరపున ఈ బృందం పరిశీలించింది. ఇక్కడ పకతి వ్యవసాయ విధానాలను నిశితంగా పరిశీలించి రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, రుచి, పండించే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రైతులతో మాట్లాడి ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవసాయం విధానంలో వినియోగించే ఘణ, ద్రవ జీవామృతాల తయారీ, నీమాస్త్రం, బీజామృతం తయారీ విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పథకాల అమలులో జిల్లాస్థాయి గుర్తింపు తేవాలి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ప్రభుత్వ పథకాల అమల్లో పెదనందిపాడు మండలానికి జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అధికారులు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇంజనీర్లు , సిఆర్‌పిల సమావేశంలో వారు మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. రెండో విడత నాడు- నేడు పనులను సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది పాఠశాలల పర్యవేక్షణ పై సమీక్ష నిర్వహించారు. ప్రతి సోమవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఫోటోలు తీసి యాప్‌లో

సమావేశంలో మాట్లాడుతున్న జి. విజయలక్ష్మీ

అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం కేపీ పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక జడ్పీ పాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులను తనిఖీ చేశారు. వారి వెంట జిల్లా సమాచార సమన్వయకర్త జె రవి, ఈఈ సుధాకర్, ఏపిఎం సుబ్బారావు, ఎంఆర్‌సి స్టాఫ్ ఉన్నారు .

ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు కృషి

తాగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో ప్రతి ఇంటికీ మంచినీరు అందించడానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హామీనిచ్చారు. మంగళవారం ఉదయం గ్రామంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజర్ సాండ్ ఫిల్టర్ల ద్వారా పబ్లిక్ ట్యాపుల ద్వారా ఇళ్ల ముందుకు వస్తున్న తాగునీటిని ఆయన తాగి పరిశీలించారు. ట్యాపుల ద్వారా వస్తున్న నీరు శుద్ధిగా ఉందా లేదా అధికారుల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది పక్కనే ఉన్న ఉండవల్లిలో ఇక నుంచి తాగునీటి కష్టాలు ఉండవని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ కృష్ణానది ఇళ్ల డబుల్ ఫిల్టర్ చేసి అందించబడతాయని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో పూర్తిస్థాయి తాగునీరు గ్రామంలో ప్రతి ఇంటికీ అందిస్తామని హామీనిచ్చారు. ఉండవల్లిలో ఫ్రీ ఎంఎల్‌డి యూనిట్లు ఏర్పాటు చేసే ఆలోచనలో సిఎం ఉన్నట్లు చెప్పారు. ఉండవల్లితో పాటు పక్కనే ఉన్న గ్రామాలకు కూడా రాపిడ్ ఫిల్టర్లు ఏర్పాటు చేసి కృష్ణానది నుంచి తాగునీరు అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట డిఇ కృష్ణారెడ్డి, బుర్రముక్కు భాస్కరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఇప్పటం రోడ్డులో గల మహమ్మదీయ మస్జిద్ అభివృద్ధి నిర్మాణ పనులకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ. లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం వైసిపి పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, షేక్ హన్నన్, అంజుమన్ అధ్యక్షుడు అష్రఫ్ ఖాన్‌ల చేతుల మీదుగా మస్జిద్ కమిటీ సభ్యులకు అందజేశారు.

వర్ణికను అభినందిస్తున్న డైరెక్టర్ మురళీకాంత్

యోగాలో నెహ్రూ నికేతన్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-తెనాలి

జాతీయ స్థాయి యోగా పోటీల్లో స్థానిక బోస్- రోడ్డులోని నెహ్రూ నికేతన్‌లో 5వ తరగతి విద్యార్థిని అడుసుమల్లి వర్ణిక సత్తాచాటింది. పాఠశాల్లో మంగళవారం విద్యార్థినిని అభినందించిన అనంతరం డైరెక్టర్ మురళీకాంత్ దాసరి వివరాలను వెల్లడించారు. తమిళనాడు ప్రభుత్వ గుర్తింపు పొందిన నేచురల్ యోగా అసోసియేషన్ యోగా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ సంస్థ ఇంటిగ్రేటెడ్ కల్చరల్ కాంపిటీషన్స్ పేరుతో ఈనెల 5న తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాలోని ఒరప్పమ్‌లో జాతీయ స్థాయిలో యోగా పోటీలు నిర్వహించారు. పాఠశాల నుంచి పాల్గొన్న వర్ణిక ప్రధమ స్థానం పొందింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వర్ణిక కామన్ విభాగంలో పాల్గొని ధనురాసనం, చక్రాసనం, వృక్షాసనం, డోలాసనం, వటయాన ఆసనం, గర్భపిండాసనం, ఉష్ణాసనాలను ప్రదర్శించి సత్తా చాటింది. నిర్వాహకులు పంపిన జ్ఞాపిక, బంగారు పతకాలు వర్ణికకు అందించి అభినందించారు. కార్యక్రమంలో బాలబాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భువన్‌సోమ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ కౌన్సిలర్ భువన సోమ్ మృతి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

మాజీ కౌన్సిలర్ భువన సోమ్(77) అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆంధ్ర బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా విశిష్ట సేవలు అందించిన ఆయన రిటైర్మెంట్ తర్వాత వైసిపి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరి 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. భువన సోమ్ మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ ఫోన్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. భువన సోమ్ వైసిపికి చేసిన సేవలు మరువరానివనారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ షేక్ సుఫియా సుల్తానా, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన నాగరాజు, మాజీ మున్సిపల్ విప్ మూకిరి అనిల కుమారి , మాజీ కౌన్సిలర్లు షేక్ షర్మిల, విజయ్ బాబు, మహమ్మద్ సలీమా బేగం, షేక్ గౌసియా, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య , వైసిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ బాబు ఖాన్,రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ వాహిదుల్లా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు షేక్ సఫాయతుల్లా, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ముల్లా కరీం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ విద్యార్థులకు హెచ్‌సిఎల్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ హెచ్‌సిఎల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు రూ.6 లక్షల ప్యాకేజితో 5గురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలియజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించింది. ప్రస్తుత జీవన విధానం డిజిటలైజేషన్‌తో ముడిపడి ఉన్నందున సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యత ఎంతో ఉందని, ఆరంగంలో కూడా తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపటం తమకు గర్వకారణమని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న డి.కోదండ హరీష్, కె.దివ్యశ్రీ, ఎం.మౌనిక, మన్నెం మనస్సే, వి.శివలీల ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపిన వారిలో కాలేజి ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం కళాశాల యాజమాన్యం

జెఇఇ మెయిన్స్‌లో భాష్యం సంచలనం

ప్రజాశక్తి-గుంటూరు

జెఇఇ మెయిన్స్-2023 ఫలితాల్లో భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ విద్యార్థులు 99.99 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలో భాష్యం విద్యార్థులు ఎ.వెంకటశివరామ్, పి.నిశ్చల్ సుభాష్‌లు 99.99 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. అదే విధంగా భాష్యం విద్యార్థి నిశ్చల్ సుభాష్ ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీ ఇడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ స్థానాన్ని సాధించి, భాష్యం విద్యా సంస్థకే గర్వకారణంగా నిలిచాడని తెలిపారు. అంతేకాక 99.9పర్సంటైల్ ఆపైగా 18 మంది, 99.7పర్సంటైల్ ఆపైగా 42 మంది, 99.5పర్సంటైల్ ఆపైగా 54 మంది, 99 పర్సంటైల్ ఆపైగా 82 మంది విద్యార్థులతోపాటు, వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్ 8 మంది సాధించారని తెలిపారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ప్రతి ఏటా అంచనాలకు అందని ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఈ సంచలన విజయాలకు భాష్యం ఐఐటీ ఫౌండేషన్ కరిక్యులమే కారణమన్నారు. విద్యార్థులకు అధ్యాపకులకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందనలు తెలిపారు

విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్స్ అధినేత లావు రత్తయ్య

విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

జేఈఈ మెయిన్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో విజ్ఞాన్ విద్యార్థులు విజయభేరి మోగించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. మంగళవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జే.మోహనరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఐఐటీ మెయిన్స్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 25 శాతం మంది 90 శాతంపైగా పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. అందులో డీ.నీరజ్‌బాబు 99.21, జీ.జితేంద్ర మోహన్ 98.48, జీ.విష్ణువర్ధన్ బాబు 97.69, ఎం.జస్వంత్ సాయి 97.51, ఎం.పవన్‌సాయి 95.42, ఏ.సంపత్ 95.27, ఎస్.శ్రీరామ్ 95.15, వై.ఈశ్వర సుమంత్ 94.96, ఎం.దిలీప్‌బాబు 94.84, ఎం.వరుణ్ 94.75, జే.చంద్రశేఖర్ 94.37, బీ.ఓం సాయి చంద్ 94.3, జే.వీరభద్ర 93.98, కే.వెంకటశివ ప్రణయ్ 93.55, ఏ.లోకేష్ 90 పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను విజ్ఞాన్స్ అధినేత డాక్టర లావు రత్తయ్య, వీసీ పీ.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

15న ఔషధ వ్యాపారుల దేశవ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

ఆలిండియా ఔషధ నియంత్రణ చట్టాల్ని గత ఏడేళ్లుగా ఉల్లంఘిస్తున్న ఈ- ఫార్మసీలను అరికట్టేందుకు తక్షణం కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా, ప్రజాప్రతినిధుల దృష్టికి పార్లమెంటు దృష్టికి తీసుకువచ్చేలాగా ఈనెల 15వ తేదీ దేశవ్యాప్తంగా ఔషధ వ్యాపారుల నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కెపి రంగారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని జిల్లా కెమిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఉద్యమ కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ ద్వారా పౌరులందరికీ ఆరోగ్య గుర్తింపు కార్డు పొందటం హక్కుగా ప్రభుత్వం ప్రత్యేక డిజైన్ ద్వారా పౌరుడి భద్రత, వ్యక్తిగత ఆరోగ్య కార్డుల గోప్యత, జాతీయ విధానం అమలు చేయబడుతుందన్నారు. అయితే దీన్ని ఆధారం చేసుకుని ఈ-ఫార్మసీ కంపెనీలు వారి సొంత సాఫ్ట్‌వేర్ యాప్‌ల ద్వారా పౌరుల వైద్య డేటాలను సేకరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ -ఫార్మసీ వ్యాపారంలో చేసే అక్రమాల ద్వారా చిన్న మధ్యతరగతి ఔషధ వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిం దన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చిన్న వ్యాపారుల మనుగడను దృష్టిలో ఉంచుకొని ఈ-ఫార్మసీల అక్రమ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

వ్యాపారాలను, నకిలీ మందుల ప్రవేశానికి దారి తీసే అక్రమ కొనుగోలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15వ తేదీన ఔషధ వ్యాపారులందరూ ఆందోళనలో పాల్గొని, మండల, జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖరరావు, జిల్లా అసోసియేషన్ కోశాధికారి టీవీ సుబ్రహ్మణ్యం, నగర హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు గార్లపాటి ఆదినారాయణ, కార్యదర్శి టీవీ సాయిరాం, గుంటూరు హోల్ సేల్ ఫార్మా అసోసియేషన్ అధ్యక్షులు షేక్ బాబర్, సెక్రటరీ కే చంద్రశేఖర్, రిటైల్ అసోసియేషన్ సెక్రటరీ, టీవీ ఎల్ నరసింహారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

మండలంలోని జొన్నలగడ్డ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత సూర్య టెక్ సొల్యూషన్స్ కంపెనీ ఈనెల 2న నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాల విద్యార్థులు 50 మంది ఉద్యోగాలు సాధించినట్లు సోమవారం కంపెనీ ప్రతినిధులు వెల్లడించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల నుండి వివిధ బ్రాంచ్‌లకు చెందిన 110 మంది విద్యార్థులను కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు సతీష్, వినోద్ నిర్వహించిన వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ మరియు హెచ్‌ఆర్ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో ప్రతిభ చాటిన 50 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. బీటెక్ అయిపోయిన వెంటనే విద్యార్థులు ఉద్యోగాలలో చేరనున్నట్లు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణా కాలంలో రూ 2.57 లక్షలు వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతుల నేపథ్యంలో బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల వైస్ ఛైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం అభినందించారు. విద్యార్థులు కొలువులు సాధించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన కళాశాల ప్లేస్మెంట్ అధికారి ఏం సాంబశివరావు, అసిస్టెంట్ ప్లేస్మెంట్ అధికారి ఎం శ్రీకాంత్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఐఐటి మెయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల విజయం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ఐఐటి మెయిన్స్ మొదట దశ పరీక్ష ఫలితాల్లో గుంటూరు ఎస్.ఆర్. విద్యాసంస్థల విద్యార్థులు విజయ పతాకం ఎగరవేశారు. ఐ.ఐ.టి. మెయిన్స్ మొదటి దశ పరీక్ష ఫలితాలలో అబ్దుల్ సమీర్ 99.78శాతం,షేక్ ఆసిఫ్ 99.10 శాతం మార్కులు సాధించి విజయ భేరి మ్రోగించారు. మూడు రాష్ట్రాలలో అధిక సంఖ్యలో జే.ఈ.ఈ మెయిన్స్ లో 99 శాతం ఫలితాలు రాణించామని ఎస్.ఆర్. విద్య సంస్థ జనరల్ మేనేజర్ ఎం.పూర్ణ చంద్ర రావు మంగళ వారం మీడియాకి తెలిపారు. ఎస్.ఆర్.విద్య సంస్థలు అతి తక్కువ కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు పేరు రావటం గర్వంగా ఉంద న్నారు. విజయానికి కారణమైన విద్యార్థులను, సిబ్బందిని ఎస్సార్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎనగందుల వరదా రెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి , సీఈవో సురేందర్ రెడ్డి , జీఎం రాజేంద్రప్రసాద్, జీఎం గోవర్ధన్ రెడ్డి లు అభినందించారు. మీడియా సమావేశంలో డీన్ అప్పిరెడ్డి, అసిస్టెంట్ జోనల్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సురేష్ ,ఉదయ్ కుమార్ పద్మాకర్ రమేష్ శశిధర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా

ప్రజాశక్తి-గుంటూరు

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య గుంటూరు విద్యార్థులు అత్యధిక అధిక మార్కులు సాధించి, ప్రతిభ చూపారని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈ.దుర్గాప్రసాద్ అన్నారు. బి.లోకేష్ రెడ్డి 99.79, టి.నిఖిలేష్ శివసాయి 99.73, మేఘన సాయి 99.61, ఎస్.వెంకటశైలజ 99.59, పి.తేజాస్ కార్తీక్ 99.55, ఎం.మౌనిక 99.54, పి.హన్విత 99.53తోపాటు 90కిపైగా పర్సంటైల్ ఆపైన 220మంది మంది సాధించార న్నారు. ఆయా విద్యార్థులను ఎజిఎం దుర్గాప్రసాద్, డీన్ కిషోర్, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అసైన్డ్ రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ విచారణ పేరుతో కౌలు చెల్లింపులో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. అసైన్డ్ రైతులైన దళితులు, ఇతర వర్గాల పేదలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రాజధాని నిర్మాణం కోసం 29గ్రామాలలోని దళితులు, ఇతర పేద వర్గాలు సుమారు 3 వేల ఎకరాలు అసైన్డ్ భూములిచ్చారని, ఏటా మే - జూన్ నెలలో చెల్లించాల్సిన కౌలును సిఆర్‌డిఎ అధికారులు ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. తక్షణమే కౌలు చెల్లించాలని రవి డిమాండ్ చేశారు.